క్లుప్తంగా

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఐరాల విద్యార్థిని


విద్యార్థిని నిత్యశ్రీతో హెచ్‌ఎం, పీడీ

ఐరాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన నిత్యశ్రీ జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు మంగళవారం పాఠశాల హెచ్‌ఎం కోమల తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల నందికొట్కూరు జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించిన 67వ స్కూల్‌గేమ్స్‌లో భాగంగా రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని పేర్కొన్నారు. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు చత్తీస్‌గఢ్ రాష్ట్రం కోర్బా జిల్లాలో నిర్వహించనున్న జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీల్లో నిత్యశ్రీ పాల్గొంటుందని వెల్లడించారు. ఈ సందర్భంగా నిత్యశ్రీ, పీడీ దేవాలను హెచ్‌ఎం, పీఎంసీ చైర్మన్ రవీంద్రరెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

నియోజకవర్గ పోటీల్లోనూ విజయం సాధించాలి

బంగారుపాళెం: మండలానికి చెందిన క్రీడాకారులు సత్తా చాటి నియోజకవర్గ స్థాయి పోటీల్లోనూ రాణించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి సూచించారు. ఆయన మాట్లాడుతూ, పూతలపట్టులో బుధవారం నుంచి నియోజకవర్గ స్థాయిలో క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని క్రీడాకారులు ఆయా విభాగంలోని పోటీల్లో తమ సత్తా చాటాలన్నారు.

పవర్ గ్రిడ్ లైన్ల కింద మంటలు వేయొద్దు


కరపత్రాలను ప్రారంభిస్తున్న పవర్‌గ్రిడ్ అధికారులు

యాదమరి: మండలంలో పవర్‌గ్రిడ్ వారు ఏర్పాటు చేసిన పవర్‌గ్రిడ్ ఆధీనంలో ఉన్న కర్నూలు- తిరువళము, కడప- చిత్తూరు, నెల్లూరు- తిరువళము, కోలారు- తిరువళము, నెల్లూరు-శ్రీపెరంబదూరు మార్గంలో ఉన్న హెచ్‌టీ లైనులు కింద భూములు ఉన్న రైతులు, ఇతరులు లైను కింద మంటలు వేయరాదని పవర్‌గ్రిడ్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. మంటలు వేయడం ద్వారా కరెంటుకు అంతరాయం ఏర్పడడంతో పాటు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. కరెంటు లైన్ల కింద వ్యవసాయ వ్యర్థాలు కానీ వ్యవసాయేతర వస్తువులు తగులపెట్టరాదన్నారు. నిబంధనలను రైతులు, సంబంధిత ప్రజలు తప్పకుండా పాటించాలన్నారు.

కుష్టు విభాగం తనిఖీ


రోగులతో మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్


చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని కుష్టు విభాగాన్ని మంగళవారం రాష్ట్ర కుష్టు విభాగ జాయింట్ డైరెక్టర్ దేవసాగర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల ఆరోగ్య పరిస్థితి, ఆస్పత్రిలో వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్, అధికారులు రెడ్డెప్ప, షర్మిల, రవికుమార్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

చామంతిపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రక్షిత

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బొమ్మసముద్రం డాక్టర్ రక్షిత కోరారు. మండలంలోని చామంతిపురంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇళ్ల వద్ద మంచానికే పరిమితమైన రోగుల వద్దకు వెళ్లి వారికి వైద్యం చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీలక్ష్మి, యమున, ప్రియాంక, శ్రీలత, దేవప్రీత, రాధ పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఈ-క్రాప్ బుకింగ్


ఈ-క్రాప్ బుకింగ్ చేస్తున్న వ్యవసాయ అధికారులు

గుడిపాల: ఈ-క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలని వ్యవసాయాధికారి మాధవి అన్నారు. మంగళవారం కమ్మతిమ్మాపల్లె, చలిచీమలపల్లెలో రైతులకు ఈ-క్రాప్ బుకింగ్ చేయించారు. ఫిబ్రవరి 15వ తేదీలోపు అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఈ క్రాప్ బుకింగ్‌ను చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ సోనియా పాల్గొన్నారు.

మైదానంలో క్రీడాకారులు



క్రీడామైదానాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ చిన్నయ్య



'ఆడుదాం ఆంధ్రా' జోరు

ప్రతిభ ఉండీ.... సరైన ప్రోత్సాహం లేక అనేక మంది ఇప్పటి వరకు క్రీడా వేదికలనూ పాల్గొనలేక పోయారు. వీరి పాలిట వరంగా నిలిచి... భవిష్యత్తు క్రీడాకారులను తయారు చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో పదిహేనేళ్ల పైబడిన వారిలో క్రీడాశక్తిని పెంచి, వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు ఈ క్రీడోత్సవాల నిర్వహణకు పూనుకున్నారు. పూతలపట్టు నియోజకవర్గ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. 45 ఏళ్ల పైబడిన వారు కూడా క్రీడల్లో ఉల్లాసంగా పాల్గొంటున్నారు.

- నియోజకవర్గ స్థాయి పోటీలకు గ్రామీణ క్రీడాకారులు
- నేడు నియోజకవర్గ స్థాయిలో క్రీడాపోటీలు ప్రారంభం
- పూతలపట్టు వేదికగా నిర్వహిస్తున్న ఉన్నతాధికారులు
- జిల్లా స్థాయికి పోటీ పడాలన్నదే క్రీడాకారుల లక్ష్యం

పూతలపట్టు: భోగి మంటలు... సంక్రాంతి సందడి, కనుమ సంబరాలు ముగిశాయి. ఈ పండుగలను పురస్కరించుకొని నిర్వహించిన కోడి పందాలు బరులు ఆగిపోయాయి. ఇప్పుడు తిరిగి నియోజకవర్గంలోని ప్రజలు 'ఆడుదాం ఆంధ్రా' క్రీడోత్సవాల వైపు చూపు సారించారు. రాష్ట్ర పభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ పోటీలు పూతలపట్టు నియోజకవర్గంలోని ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల స్థాయి ఉంచి మండల స్థాయి వరకు విజయవంతంగా ముగిశాయి. ఈ క్రీడా సంరంభం హోరాహోరీగా సాగుతోంది. నియోజకవర్గంలో నిర్వహిస్తున్న క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలకు ప్రజల వద్ద నుంచి విశేష స్పందన లభించింది. నియోజకవర్గంలోని వైఎస్ ఆర్ సీపీ నాయకులు, అధికారుల సైతం కార్యక్రమంపై ఆసక్తి కనబరిచారు. నాలుగు దశల్లో జరిగే ఈ క్రీడల్లో ప్రస్తుతం మండల స్థాయి పోటీలు ముగిశాయి. ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయి పోటీలను పూతలపట్టు మండల వేదికగా ఉన్నతాధికారులు నిర్వహించనున్నారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో తలపడనున్నారు. ఈ పోటీలకు నియోజకవర్గంలోని యాదమరి, పూతలపట్టు, బంగారుపాళ్యం, ఐరాల, తవణంపల్లి మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారు. ఆయా మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్టు పక్క మండలాలతో తలపడనున్నాయి. ఇక్కడ గెలుపొందిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో ఆడనున్నారు. ఈ పోటీలకు క్రీడాకారుల నుంచి ప్రజలు సైతం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు పూతలపట్టు మండలంలో ఉన్నతాధికారులు నిర్వహించడంతో మండలంలోని అధికారుల ఏర్పాట్లకు సన్నద్ధమవుతున్నారు. మైదానంలో క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్త వహిస్తున్నారు. ఐదు మండలాల్లోని ఎంపీడీఓలు, తహసీల్దార్లు, పీడీలు, సచివాలయాల సిబ్బందికి ఉన్నతాధికారులు ప్రత్యేక డ్యూటీలు వేసి పకడ్బందీగా ముందుకెళ్తున్నారు. ప్రతి మండలంలోని పురుషులు, స్త్రీలు పాల్గొనడంతో మధ్యాహ్న సమయంలో భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నారు. క్రీడల్లో గెలిచిన జట్టుకు అక్కడికక్కడే బహుమతులు ప్రదానం చేస్తున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.30,000, రెండో బహుమతిగా రూ.15,000, మూడవ బహుమతిగా రూ.5,000 అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.


మైదానంలో ఖో-ఖో ఆడుతున్న క్రీడాకారులు

నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీల వివరాలు

క్ర.సం	తేది, సమయము	నిర్వహించే క్రీడలు	ప్రదేశము
1.	24.01.2024, బుధవారం ఉ.10 గంటలకు	వాలీబాల్(పురుషులు), కబడ్డీ(పురుషులు,స్త్రీలు)	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పూతలపట్టు
2.	25.01.2024, గురువారం ఉ.8.30 గంటలకు	క్రికెట్ (పురుషులు)	బహిరంగ మైదానం, పోలవరం, పూతలపట్టు మండలం
	ఉ.9 గంటలకు	బ్యాడ్మింటన్(పురుషులు,స్త్రీ)	జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల,పూతలపట్టు
3.	27.01.2024 .శనివారం ఉ. 9గంటలకు	క్రికెట్(ఫైనల్స్)	బహిరంగ మైదానం, పోలవరం, పూతలపట్టు మండలం
	ఉ.9గంటలకు	ఖో-ఖో(పురుషులు,స్త్రీలు)	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,పూతలపట్టు
4.	29.01.2024, సోమవారం ఉ.9 గంటలకు	వాలీబాల్(స్త్రీలు), క్రికెట్(స్త్రీలు)	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పూతలపట్టు

క్రీడాకారులకు సూచనలు

- క్రీడాకారులు సంబంధిత తేదీల్లో ప్రారంభానికి 30 నిమిషాల ముందు క్రీడలు నిర్వహించే ప్రదేశాలకు హాజరు కావాలి.
- క్రీడాకారులు తప్పని సరిగా ప్రభుత్వం ఇచ్చిన క్రీడావస్తువులతో ఆడాలి
- ప్రభుత్వం ఇచ్చిన క్రీడా దుస్తులతోనే మైదానానికి హాజరు కావాలి
- క్రీడాకారులు హాజరయ్యే ముందు తప్పనిసరిగా ఐడీ కార్డు(ఆధార్ కార్డు, రిజిస్ట్రేషన్ పత్రం) తీసుకురావాలి
- క్రీడలు ప్రారంభ సమయానికి ఆలస్యంగా రాకూడదు

పకడ్బందీగా నిర్వహిస్తాం



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా' పోటీలను మండల స్థాయి వరకు విజయవంతంగా నిర్వహించాం. నియోజకవర్గ స్థాయి పోటీలను పకడ్బందీగా నిర్వహిస్తాం. ఆయా మండల అధికారులకు ప్రత్యేక విధులు కేటాయించి విజయవంతం చేయాలని సూచించాం. పీడీలకు, అధికారులకు సమీక్షా సమావేశం నిర్వహించి, వారికి అవగాహన కల్పించాం. మైదానాలలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా పోలీసు అధికారులకు తెలియజేశాం. నియోజకవర్గ స్థాయి పోటీలు విజయవంతమవ్వడానికి కృషి చేస్తాం.

– చిన్నయ్య, నోడల్ అధికారి ఆడుదాం ఆంధ్రా(ఆర్డీఓ, చిత్తూరు)

28న వీరరుద్ర వన్నియర్ విగ్రహావిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

చిత్తూరు రూరల్: ఈనెల 28న చిత్తూరు గాంధీ రోడ్డులో వన్నియ క్షత్రియ చిహ్నం జంబు మహర్షి వీరరుద్ర వన్నియర్ విగ్రహావిష్కరణ చేయనున్నట్టు వన్నియ కుల క్షత్రియ ఎడ్యుకేషన్ - డెవలప్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం చిత్తూరులో వన్నియ కుల క్షత్రియ సంఘ కళ్యాణ మండపంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆకుల క్షత్రియ చిహ్నం (అగ్ని కలశం), జంబు మహర్షి వీరరుద్ర వన్నియార్ విగ్రహావిష్కరణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆ సంఘం అధ్యక్షులు కాశీ నాయకర్, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, కార్పొరేటర్ శశి మాట్లాడారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో 28న ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. దీనికి కులస్తులందరూ పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కృపానందం, కట్టమంచి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో ప్రముఖులు


ప్రకాశం యాదవ్‌కు స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాశం యాదవ్, కమిటీ సభ్యులు, రాష్ట్ర మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు వేర్వేరుగా మంగళవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, హరి మాధవరెడ్డి తదితరులు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా కనుమ

పెద్దపంజాణి: మండలంలోని పెద్దకాప్పల్లె పంచాయతీ గ్రామాలలో మంగళవారం కనుమ పండుగను ఘనంగా నిర్వహించారు. ఎద్దులు, పాడి పశువులను అలంకరించి బాణసంచా పేలుళ్లు, డప్పు వాయిద్యాలతో గ్రామ పొలిమేరలోని కాటమరాజు గుడి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించారు. అనంతరం ఎద్దులను పరుగులు తీయించారు.

విద్యార్థుల మాక్ పోలింగ్


బంగారుపాళెం: తుంబకుప్పం ఉన్నత పాఠశాలలో మాక్ పోల్‌ను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ నాగేశ్వర్‌రావు


యాదమరి: ఓటు హక్కును వినియోగించుకుంటున్న విద్యార్థులు


పూతలపట్టు: మాక్ పోలింగ్‌లో విద్యార్థులు


గుడిపాల: విద్యార్థులతో మాక్ పోలింగ్

బంగారుపాళెం: మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులతో మాక్ పోల్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంఈఓ నాగేశ్వర్‌రావు తెలిపారు. పాఠశాలల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఎన్నికల నిర్వహణ, వాటి ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో మాక్ పోల్ నిర్వహించారు. ఎంఈఓ పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాదమరిలో...

యాదమరి: ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హెచ్‌ఎం గిరిరాజా, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు వెంకటరమణ, ఉదయబాబు, తులసిప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం మాక్ పోలింగ్‌పై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ఎన్నికల నిర్వహణ పోలింగ్‌పై అవగాహన కల్పించడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. మాక్ పోలింగ్‌లో ఎన్నికల ఓటింగ్ పద్ధతిని విద్యార్థులకు వివరించారు.కార్యక్రమాన్ని తహసీల్దార్ హనుమంతు, ఎంఈఓలు రుక్మిణి, ప్రసాద్ పర్యవేక్షించారు.

పూతలపట్టులో...

పూతలపట్టు: సార్వత్రిక ఎన్నికలపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని ఈఆర్వో శివయ్య తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో మాక్‌పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ స్టేషన్లలో నిర్వహించే ప్రతి విధానాన్ని విద్యార్థులు చక్కగా చేశారు. ఓటు వేసే విధానాన్ని విద్యార్థులకు తెలియజేశారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కును అర్హులని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించారు. తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీడీఓ గౌరి, డీటీ(ఎన్నికలు) మహేశ్వరి, డీటీ మునికృష్ణ, అధ్యాపకుడు సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారుపాళెం: విద్యార్థులు ఓటు హక్కు గురించి అవగాహన పెంచుకోవాలని ఎగువ రాగిమానుపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఇరసయ్య అన్నారు. జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పాఠశాల విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం కోసం పాటుపడే వ్యక్తులను ఎన్నుకొనే హక్కు ప్రజలకు ఓటు ద్వారా కల్పించారన్నారు. ఓటు హక్కును సక్రమమైన మార్గంలో ఉపయోగించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు ఉషారాణి, రహంతుల్లా అవగాహన కల్పించారు.

గుడిపాలలో..

గుడిపాల: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ రాజశేఖర్‌రెడ్డి, ఎంఈఓలు రామ్‌నాయక్, గణపతి, పంచాయతీరాజ్ ఎఈ జయచంద్రారెడ్డి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఓటింగ్, కౌంటింగ్..ఇత్యాది వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

అంతర పంటల సాగు రైతుల మక్కువ




కంపలపల్లె వద్ద పూత, పిందె, కాయ దశలో ఉన్న అనప పంట, విరగకాసిన అనప పంట

- మిశ్రమ పంటలతోనే అధిక ఆదాయం

తవణంపల్లె: రైతులు అంతర పంటల సాగుపై మక్కువ చూపుతున్నారు. వర్షాధారంపై ఆధాపడి పండించే పంటలను రైతులు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం గడిస్తున్నారు. రైతులు ఖరీఫ్‌లో వేరుశనగ పంటలో కంది, అలసంద, అనప, ఉద్దులు, ఉలవలు సాగు చేస్తున్నారు. సాగునీరుపై ఆధారపడకుండా వర్షాధారంతోనే అంతర పంటలను సాగు చేస్తున్నారు. కంది పంట వడుపుటకు సిద్ధంగా ఉంది. అదే విధంగా అనప, అలసంద పంటలు పూత, పిందె, కాయ దశలో ఉన్నాయి. అనప పంట తక్కువ విస్తీర్ణంగా సాగు చేసిన మంచి దిగుబడి వస్తోంది. అనప కాయ మార్కెట్లో రైతులు కిలో రూ.50కు విక్రయిస్తున్నారు. కంది పంటకు కూడా ఆశాజనకంగా ధరలు వస్తాయని రైతులు ఆశిస్తున్నారు. మండలంలో కంది పంట 120 ఎకరాలు, ఉలవలు 137 ఎకరాలు, అనప 53 ఎకరాలు, అలసంద 12 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. అనప పంట దిగుబడి ఆశాజనకంగా రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కానీ పంటలకు చీడలు, పీడలు ఆశిస్తున్నాయి.

సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులు అంతర పంటలు, చిరుధాన్యాలు సాగు చేయడం మంచిది. వీటి వల్ల రైతులకు మంచి దిగుబడి, ఆదాయం వస్తుంది. ప్రస్తుతం అంతర పంటను మచ్చ పరుగులు, కాయ తొలుచు పురుగులు ఆశిస్తున్నాయి. వీటి నివారణకు వేప నూనె లీటరు నీటిలో 0.5 ఎంఎల్ లేక క్లోరిపైరిఫాస్ మందును లీటరు నీటిలో 1.5 ఎంఎల్ మందును కలిపి పిచికారీ చేస్తే పురుగులను నివారించి, మంచి దిగుబడి సాధించవచ్చు.

– జి.ప్రవీణ్, వ్యవసాయాధికారి, తవణంపల్లె

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన


జొన్నగురకల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


చిత్తూరు రూరల్: రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది


ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శారద

తవణంపల్లె: ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. మంగళవారం మండలంలోని జొన్నగురకలలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరం నిర్వహించారు. మండల వైద్యాధికారులు డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్ వేలు, కంటి వైద్య నిపుణుడు డాక్టర్ ధర్మేంద్ర, గైనకాలజిస్టు డాక్టర్ షర్మద, ఎముకలు, కీళ్ల వైద్యాధికారి డాక్టర్ అఖిల్ 325 మందికి వైద్య పరీక్షలు చేశారు. కంటి వైద్యం కోసం ఏడుగురిని, మలేరియా వ్యాధిగ్రస్తులు ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్ఆర్ సీపీ నాయకులు పంపిణీ చేశారు. మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు హరిరెడ్డి, నాయకులు రాజశేఖర్ రెడ్డి, పరమేశ్వరరెడ్డి, రవిరెడ్డి, జగన్నాథరెడ్డి, తేజారెడ్డి, కుమార్, బాబురెడ్డి పాల్గొన్నారు.

తాళంబేడులో..

చిత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణుల ముంగిటకే వైద్య సేవలను తీసుకొచ్చిందని తహసీల్దార్ మురళిమోహన్, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. చిత్తూరు మండలం తాళంబేడులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు రోగులను పరీక్షించి మందులు, మాత్రలు అందజేశారు. అలాగే కొంత మందిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేపనపల్లెలో..

పూతలపట్టు: మండలంలోని వేపనపల్లె పంచాయతీలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష 2 శిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ గౌరి మాట్లాడుతూ శిబిరంలో 72 మంది రోగులకు వైద్యపరీక్షలు చేశారని చెప్పారు.కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సర్పంచ్ మణి తదితరులు పాల్గొన్నారు.

నాగంవాండ్లపల్లెలో...

ఐరాల: మండలంలోని నాగంవాండ్లపల్లెలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ మోహన్ ప్రారంభించి మాట్లాడారు. అనంతరం శిబిరంలో 318 మందికి స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వృద్ధులకు కంటి పరీక్షలు చేసి కళ్లద్దాలు, హెల్త్‌కార్డులు పంపిణీ చేశారు. సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీడీఓ నాగరాజు, స్పెషలిస్టు డాక్టర్లు పూర్ణలత, శిరీష, శారద, సీహెచ్‌ఓ సుగుణవతి, పంచాయతీ కార్యదర్శి శ్యామల పాల్గొన్నారు.

నేటి నుంచి ఇస్తిమా

పుంగనూరు: పట్టణ సమీపంలోని భీమగానిపల్లె క్రాస్ వద్ద బుధ, గురువారాలు నిర్వహించ తలపెట్టిన ఇస్తిమా కార్యక్రమానికి ముస్లింలు ఏర్పాట్లు పూర్తి చేశారు. 20 ఎకరాల భూమిని చదును చేసి షామియానాలు, పెండాల్స్, సౌండ్‌బాక్సులు, స్పీకర్లు, ఎల్ఈడీ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. బెంగళూరుకు చెందిన మత గురువులు మౌలానా ఫరూక్‌సాహెబ్, అక్బర్‌సాహెబ్, ముఫ్తి అస్లాం సాహెబ్, ఎంఎస్.సర్దార్ సాహెబ్ ధార్మికోపన్యాసాలు చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి హాజరయ్యే వేలాది ముస్లింలకు భోజనం, తాగునీరు, వసతి కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐ రాఘువరెడ్డి పటిష్ట బందోబస్తు కల్పించారు. ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వైఎస్సార్‌సీపీ సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, కౌన్సిలర్ కిజర్‌ఖాన్, మైనారిటీ నాయకులు పర్యవేక్షించారు.